## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నస్పూర్, మే 20 : ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. మంగళవారం స్థానిక అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య, డీఈవో యాదయ్యతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## జాన్సన్ నాయక్‌పై అక్రమ కేసు ఎత్తివేయాలి

**బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జనార్దన్

జన్నారం, మే 20 : బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్‌పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా జరిగిన చిన్నపాటి గొడవను దృష్టిలో పెట్టుకొని కక్షగట్టారని, 17 నెలల తర్వాత పోలీసులు అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ జాన్సన్ నాయక్‌పై అక్రమంగా కేసు నమోదు చేయడం సరికాదన్నారు. తమపై ఎన్నికేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజల మధ్య ఉంటూ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సిటిమల్ల భరత్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, నాయకులు ఫజల్‌ఖాన్, బోర్లకుంట ప్రభుదాస్, ప్రసాద్‌నేత, జాడి గంగాధర్, నర్సింహులు, భరత్‌నాయక్ పాల్గొన్నారు.



చెన్నూర్ కిష్టంపేట టోల్‌గేట్ సమీపంలో నిలిచిన వాహనాలు



# రూ.100 కడితేనే.. పుష్కర స్నానం

## పోనూ, రానూ రూ.50 ముడితేనే కాళేశ్వరం దాక వెళ్లేది..

- పైసలు దండుకునేందుకే చెన్నూర్‌లో ఫారెస్టు టోల్‌గేట్లు ప్రారంభం
- భక్తుల నుంచి డబ్బులు తీసుకోవద్దని భూపాలపల్లి కలెక్టర్ ఆదేశాలు
- మంచిర్యాల, చెన్నూర్‌లో టోల్‌గేట్లను ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే వివేక్
- చెన్నూర్, కోటపల్లి స్థానికులకూ రూ.50 కటింగ్
- మండిపడుతున్న భక్తులు, స్థానికులు

మంచిర్యాల, మే 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి చెన్నూర్ మీదుగా కాళేశ్వరం వెళ్లి సరస్వతీ పుష్కర స్నానం చేయాలనుకుంటున్నారా? అయితే మీరు చెన్నూర్ ఫారెస్ట్ టోల్‌గేట్ల వద్ద పోనూ రూ.50, రానూ రూ.50 చెల్లించాలి. ఈ పైసలు ముడితేనే మీరు పుష్కర స్నానం చేసి పునీతులు కాగలరు. లేని పక్షంలో ఇబ్బంది పడక తప్పదు. సరస్వతీ పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పుష్కరస్నానం కోసమని కాళేశ్వరానికి వాహనాల్లో వచ్చే భక్తుల నుంచి డబ్బులు వసూలు చేయవద్దని భూపాలపల్లి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కానీ.. దానికి విరుద్ధంగా మంచిర్యాల జిల్లా చెన్నూర్ అటవీశాఖ అధికారులు పుష్కర స్నానానికి వచ్చే భక్తులే టార్గెట్‌గా చెన్నూర్, పారుపల్లిలో రెండు ఫారెస్ట్ చెక్‌పోస్టులను మొదలు పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరస్వతీ పుష్కరాలకు వెళ్లే భక్తుల గురించి ఆలోచించకుండా స్థానిక ఎమ్మెల్యే వివేక్ ఈ టోల్‌గేట్లను ప్రారంభించడంపై స్థానికులు, భక్తులు మండిపడుతున్నారు. రెండు రోజులుగా చెన్నూర్ మీదుగా కాళేశ్వరం వెళ్లే వాహనదారుల నుంచి టోల్ వసూలు చేస్తున్నారు. సదుపాయాలు లేకుండా చెక్‌పోస్టులు పెట్టి టోల్ వసూలు చేస్తుండడంతో పుష్కరసాన్నానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చెక్‌పోస్టుల దగ్గర రోడ్డు వెడల్పు చేయలేదు. ఉన్న రోడ్డుపైనే డ్రమ్ములు పెట్టి ఇరుకుగా చేశారు. దీంతో టోల్‌గేట్ల సమీపంలో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడి భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇన్ని రోజులు లేనిది పుష్కరాల సమయంలోనే హడావుడిగా టోల్‌గేట్లను ప్రారంభించడం విమర్శలకు తావిస్తున్నది.

### భక్తుల నుంచి ట్యాక్స్ వసూలును ఖండిస్తున్నాం..



సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తుల నుంచి గ్రీన్‌ట్యాక్స్ పేరిట టోల్ వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. గతంలోనే ఇక్కడ టోల్‌గేట్లు ఎందుకు పెడుతున్నారని అడిగినప్పుడు కేవలం ఇసుక తీసుకెళ్లే లారీలకు మాత్రమే వసూలు చేస్తాం అన్నారు. స్థానికుల నుంచి తీసుకోమని చెప్పారు. ఇప్పుడు కావాలని ఫాస్ట్‌ట్యాగ్ పెట్టి వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. చెన్నూర్, కోటపల్లి వారికి కూడా టోల్ కట్ చేయడం సరికాదు. ముఖ్యంగా పుష్కరాల కోసం కాళేశ్వరం వచ్చే భక్తుల వాహనాల నుంచి ట్యాక్స్ తీసుకోవద్దు. భూపాలపల్లి జిల్లాలోనే తీసుకోవడం లేదు. అలాంటప్పుడు మన దగ్గర ఎలా తీసుకుంటారు. ఆ రోడ్డు సెంట్రల్ గవర్నమెంట్‌ది. రాష్ట్ర ఫారెస్ట్ వాళ్లకు అక్కడ ఏం పని. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. అధికారులు స్పందించని పక్షంలో ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తాం.

*- వెంకటేశ్వర్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు*

### ముందు నుంచి వ్యతిరేకిస్తున్న స్థానికులు

నిజామాబాద్–జగ్దల్‌పూర్ జాతీయర హదారి–63పై మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో అటవీశాఖ టోల్‌గేట్లు ఏర్పాటు చేయడాన్ని స్థానికులు ముందు నుంచి వ్యతిరేకిస్తున్నారు. హరితరుసుం పేరిట టోల్‌గేట్లు పెట్టి, డబ్బులు వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. నేషనల్ హైవే పై ఫారెస్ట్ అధికారులు టోల్‌గేట్లు ఏర్పాటు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని వాదిస్తున్నారు. అధికారులు మాత్రం ఈ ప్రాంతం ప్రాణహిత(కృష్ణజింకల) అభయారణ్యం పరిధిలోకి వస్తుందని అందుకే హరితరుసం వసూలు చేసేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్తున్నారు. ఈ విషయంలో వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అతిక్రమిస్తూ, అటవీ శాఖ తన పరిధి దాటి జాతీయ రహదారిపై రుసుం వసూళ్లకు తెరలేపిందని నిపుణులు అంటున్నారు. చట్టంలో ఉన్నది ఒకటైతే అధికారులు చేసేది మరోలా ఉందంటూ మండిపడుతున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే ప్రారంభం కావాల్సిన ఈ టోల్‌గేట్లు స్థానిక వ్యతిరేకత నేపథ్యంలో వాయిదా పడ్డాయి. చెన్నూర్, కోటపల్లి మండలాలకు చెందిన వాహనదారుల నుంచి టోల్ వసూలు చేయమంటూ ఫారెస్ట్ అధికారులు చెప్పారు. ప్రస్తుతం చెన్నూర్, కోటపల్లి వాహనదారుల నుంచి కూడా టోల్ వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కారుకు రూ.50, ఆటోకు రూ.30, పెద్ద వాహనాలైతే రూ.200 టోల్ కట్ చేస్తున్నారంటూ స్థానికులు వాపోతున్నారు. ఫారెస్ట్ అధికారులు పుష్కరాల సమయంలో హడావుడిగా టోల్‌గేట్లను ప్రారంభించడంపై మండిపడుతున్నారు.

### త్వరలో ఏర్పాటు కానున్న నేషనల్ హైవే టోల్‌గేట్

చెన్నూర్‌లో ఇప్పటికే ఫారెస్ట్ అధికారులు కిష్టంపేట, పారుపల్లిలో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. చెన్నూర్‌లోనే నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో మరో టోల్‌గేట్ సిద్ధం అవుతుంది. సరిగ్గా పారుపల్లి, కిష్టంపేటకు మధ్యలో చెన్నూర్ సమీపంలోని హైవేపై టోల్‌గేట్ పెడుతున్నారు. అంటే ఇకపై ఈ మార్గంలో వచ్చే వాహనానికి అటు నేషనల్ హైవే వారు, అటు ఫారెస్ట్ వాళ్లు రెండు టోల్‌కు వసూలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒకే రోడ్డుపై పది కిలోమీటర్లు కూడా దాటకుండానే రెండు టోల్‌లు కట్టాలని ఏ చట్టంలో ఉందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. జాతీయ రహదారిపై ఫారెస్టు టోల్ గేట్ పూర్తిగా చట్ట విరుద్ధం అంటున్నారు. అటు పారుపెల్లి నుంచి కిష్టంపేట దాకా అసలు ఫారెస్ట్ అనేది లేదు. అలాంటి చోటే టోల్‌గేట్లు పెట్టడం వెనుక మతలబేంటో చెప్పాలంటున్నారు. వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్–1972 సెక్షన్ 28 (1) (డీ) అండ్ (2) అనుసరించి చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు అభయారణ్యం ప్రాంతంలో హరిత రుసం వసూలు చేసే అధికారం ఉందని అటవీ శాఖ అధికారులు చెప్తున్నారు. ఒక్కసారి యాక్ట్‌లోని 28 సెక్షన్‌ను నిశితంగా పరిశీలిస్తే.. 28 (1) (ఏ) వన్యప్రాణుల పరిశోధన–అధ్యయనం, 28 (1) (బీ) ఫొటోగ్రఫీ, 28(1) (సీ) శాస్త్రీయ పరిశోధన, 28(1) (డీ) టూరిజం గురించి చెప్తున్నాయి. ఇందులోనే సెక్షన్ 28 (2) అభయారణ్యంలోకి ఎవరైనా ప్రవేశించడానికి లేదా నివసించడానికి అనుమతించేందుకు రుసుం వసూలు చేసే అధికారాన్ని కల్పిస్తున్నది. దీని ప్రకారమే చెన్నూర్‌లోనూ హరిత రుసం వసూలు చేస్తున్నామని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. యాక్ట్‌ను అనుసరించి అభయారణ్యం పరిధి లోపలి ప్రాంతాల్లోనే ఇలా రుసుం వసూలు చేసే అధికారం అటవీ శాఖ అధికారులకు ఉంది. ప్రస్తుతం పారుపల్లి, కిష్టంపేటలో ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన టోల్‌గేట్లు పూర్తిగా జాతీయ రహదారి–63 పరిధిలోకి వస్తాయి. ఈ నేషనల్ హైవే అనేది అభ్యయారణ్యం పరిధిలోకి రాదు. అంటే ఇక్కడ రుసుం వసూలు చేసే అధికారులు ఫారెస్టు వాళ్లకు లేదనేది నిపుణుల అభిప్రాయం. ఇవేం పట్టించుకోకుండా టోల్‌గేట్లు ఏర్పాటు చేయడం, సరస్వతీ పుష్కర స్నానానికి వచ్చే వాహనదారుల నుంచి రుసుం వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది.



కోటపల్లి మండలం పారుపల్లిలో ఫారెస్ట్ చెక్‌పోస్ట్

### 10 కిలోమీటర్లు పోతే రూ.50 కట్ చేశారు



*మాది కోటపల్లి మండలంలోని కొల్లూర్ గ్రామం. స్థానికులకు టోల్ తీసుకోమని చెప్పారు. నిన్న నేను చెన్నూర్‌కు 10 కిలోమీటర్లు దూరం పోతే రూ.50 టోల్ కట్ చేసుకున్నారు. ముందు స్థానికులకు ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీవో కార్యాలయం నుంచి డేటా సేకరించి, స్థానికులకు మినహాయింపు ఇవ్వాలి. అదేం చేయకుండానే హడావుడిగా రెండు రోజుల క్రితం టోల్‌గేట్‌ను ప్రారంభించారు. రోజుకు ఐదారు సార్లు చెన్నూర్‌కు పోతాం. పోయిన ప్రతి సారి రూ.50 కట్టడం అంటే ఎక్కడికి పోయేది. స్థానికులకు కచ్చితంగా టోల్‌గేట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఫారెస్ట్ అధికారులు ఇచ్చిన మాటకు కట్టుబడాలి.*

*- జంగా రవిచంద్రన్‌రెడ్డి, కొల్లూర్.*



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలగూర రాజకుమార్

## వివేక్.. దందాలు చేసేది నీ లీడర్లే కదా

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజకుమార్ ఫైర్**

భీమారం, మే 20 : ఎమ్మెల్యే వివేక్.. ఇసుక, మట్టి, బియ్యం, భూ దందాలు చేసేది నీ వెనుకున్న లీడర్లే కదా.. అంటూ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ కుమార్ ఫైర్ అయ్యారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసరి మధునయ్య, ఆత్మూరి రాము, యువ నాయకులు సుంకరి గోపాల్, సమ్మయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. మంగళవారం స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో.. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు భూకబ్జాలు చేశారనడం సిగ్గుచేటన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట డబ్బులు వసూళ్లు చేసేది మీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడున్న పోలిస్, ఇంటెలిజెన్సీని అడిగితే ఎవరు ఏ దందా చేస్తున్నారో తెలుస్తుందన్నారు. ఈ దేశంలో రాష్ట్రపతి, ఉప ప్రధానిగా పని చేసిన దళిత లీడర్లకు లేనన్ని డబ్బులు నీకెలా వచ్చాయో తెలుపాలన్నారు. బీఆర్ఎస్ నాయకులపై మాట్లాడే ముందు పోలీస్ శాఖ నుంచి రిపోర్టు తెచ్చుకొని మాట్లాడాలని, ఓసారి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీ కాంగ్రెస్ నాయకులపై నమోదవుతున్న కేసుల గురించి పరిశీలించాలని సూచించారు. మంత్రి పొంగులేటి కార్యక్రమం ఉందని అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఇలాంటి కేసులకు భయ పడేది లేదన్నారు.

## పశువుల వాహనాల పట్టివేత

కోటపల్లి, మే 20 : మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని పారుపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలు పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. డీసీఎంలో తరలిస్తున్న 25 ఎద్దులతో పాటు బొలెరో వాహనంలో తరలిస్తున్న 4 ఎద్దులు, 2 దూడలను స్వాధీనం చేసుకొని గోశాలకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

# ఆపదలో బెబ్బులి!

## కాగజ్‌నగర్ కారిడార్‌లో సవాలుగా మారుతున్న పులుల సంరక్షణ

- వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న టైగర్స్
- గతేడాది విష ప్రయోగంతో రెండు మృత్యువాత
- తాజాగా.. ఎల్లూరు అటవీప్రాంతంలో ఆడ పులి హతం
- తునికాకు కూలీలు సమాచారం ఇచ్చే వరకూ గుర్తించలేని అధికారులు
- ఫారెస్ట్ సిబ్బంది వైఫల్యంపై విమర్శలు



2024 జనవరిలో దరిగాం అడవుల్లో పులి కళేబరం (ఫైల్)



పులి చర్మం, ఇతర అవశేషాలను చూపిస్తున్న అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : కాగజ్‌నగర్ కారిడార్‌లో పులుల సంరక్షణ సవాలుగా మారుతున్నది. నిత్యం ఎక్కడోచోట వేటగాళ్ల ఉచ్చుకు బలవుతూనే ఉండగా, కలకలం రేపుతున్నది. గతేడాది జనవరిలో విషప్రయోగంతో రెండు చనిపోగా, తాజాగా.. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మరొకటి బలైంది. ఏడాదిన్నరలోనే మూడు మృత్యువాత పడగా, వాటి భద్రత ప్రశ్నార్థకమవుతున్నది.

### రెక్కి చేసి మరీ హతం..

జిల్లాలో కొన్నేళ్లుగా పులుల సంతతి పెరుగుతూ వచ్చింది. 2015లో కదంబా అడవుల్లో ఓ ఆడపులి నాలుగు పిల్లలకు జన్మనిచ్చినట్లుగా అధికారులు గుర్తించారు. క్రమంగా వాటి సంతతి 20 వరకు పెరిగింది. కొన్ని పులులు మహారాష్ట్ర అభయారణ్యాల్లోకి రాకపోకలు సాగిస్తుండగా, జిల్లాలో పది వరకు స్థిర నివాసం ఏర్పర్చుకున్నాయి. ఈ క్రమంలో వేటగాళ్లు పులులతో పాటు వన్యప్రాణులను వేటాడుతూ హతమారుస్తున్నారు. గతేడాది జనవరిలో కాగజ్‌నగర్‌లోని దరిగాం అటవీ ప్రాంతంలో చనిపోయిన పశువు కళేబరంపై విషాన్ని చల్లగా, దానిని తిన్న రెండు పులులు మృత్యువాత పడ్డాయి. ఇక ఈ నెల 14న పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు అటవీ ప్రాంతంలో వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చి ఓ ఆడపులిని హతమార్చారు. ఇందుకు కారణమైన వారిని అదుపులోకి తీసుకొని పులి అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. నిత్యం బేస్‌క్యాంపులు, ట్రాకర్స్ ద్వారా పులుల సంచారంపై నిఘా పెట్టాల్సిన అటవీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం వల్లే వేటగాళ్లు వాటిని హతమారుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరు ఏ ప్రాంతంలో ఏ పులి సంచరిస్తోంది.. ఎప్పుడు ఎక్కడ తిరుగతుందని తెలుసుకొని.. రెక్కిచేసి మరీ హతమారుస్తున్నారు. పులులు తిరిగే మార్గాల్లో విషప్రయోగం చేయటమో.. లేక విద్యుత్ తీగలు అమర్చటమో చేస్తున్నారు.



పులి కళేబరాన్ని ఖననం చేస్తున్న అధికారులు (ఫైల్)

### అధికారుల వైఫల్యం.. వన్యప్రాణులకు శాపం

అటవీ శాఖ అధికారుల వైఫల్యం కారణంగా పులులే కాదు వన్యప్రాణులు కూడా బలైపోతున్నాయి. పులులను నిరంతరం పర్యవేక్షించేందుకు అటవీ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, యానియల్ ట్రాకర్స్, బేస్ క్యాంపులు ఏవీకూడా వేటగాళ్ల ఉచ్చు నుంచి పులులను రక్షించలేకపోతున్నాయి. ఎల్లూరు అటవీ ప్రాంతంలో పులికళేబరాన్ని తునికాకు కూలీలు గమనించి సమాచారం ఇస్తేగాని.. అటవీ అధికారులు పులి చనిపోయిన విషయాన్ని గుర్తించలేకపోయారు. పులి సంచరించే ఎల్లూరు, నల్లగుట్ట అటవీ ప్రాంతాల్లో వేటగాళ్లు తిష్ఠవేసిన విషయాన్ని అటవీ అధికారులు పసిగట్టలేకపోయారు. ఇక అడవుల్లో నీళ్లు అందుబాటులో ఉంచని కారణంగా.. జింకలు, దుప్పులువంటివి బయటకు వస్తూ వేటగాళ్ల ఉచ్చులకు, కుక్కల దాడులకు బలైపోతున్నాయి. రెండు రోజుల క్రితం బెజ్జూరు మండలం సులుగుపల్లి అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన నీల్గాయిని కుక్కలు వేటాడి చంపేశాయి. ఇటీవల కాగజ్‌నగర్ మండలం కొత్త సర్సాల అటవీ నుంచి గ్రామ సమీపంలోకి వచ్చిన దుప్పిని వేటకుక్కలు వెంబడించి చంపేశాయి. ఒకేరోజు ఈ రెండు ఘటనలు చోటుచేసుకున్నాయి.

## పులి చర్మం, గోర్లు స్వాధీనం

- అధికారుల అదుపులో నలుగురు నిందితులు
- వివరాలు వెల్లడించిన ఫారెస్ట్ అధికారులు

కాగజ్‌నగర్, మే 20 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్‌లోని పెంచికలపేట్ మండలం ఎల్లూర్ అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చుకు బలైన ఆడ పులి చర్మం, గోర్లు, దవడలు.. తదితర అవశేషాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఎఫ్‌డీపీటీ శాంతారాం తెలిపారు. ఈ మేరకు మంగళవారం కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 13న బెజ్జూర్ మండల అటవీ ప్రాంతంలోకి ఆడపులి వచ్చిందని, ఆపై పెంచికలపేట్ అటవీ ప్రాంతానికి చేరుకున్న పులి వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి ఈ నెల 14న మృత్యువాత పడిందని తెలిపారు. బెల్లంపల్లి కాగజ్‌నగర్ డివిజన్‌లకు చెందిన అటవీ శాఖ, ఇతర శాఖ అధికారుల సమన్వయంతో విచారణ చేపట్టి నిందితులను గుర్తించామన్నారు. ఆపై దహెగాం మండలం చిన్నరాస్పల్లి గ్రామానికి చెందిన శేఖర్ ఇంటి ఆవరణలో బాక్సుల్లో దాచిపెట్టిన పులి చర్మం, గోర్లు, దవడలు, తదితర అవశేషాలతో పాటు వేటకు ఉపయోగించిన విద్యుత్ తీగ, బైక్, కత్తులు, ఇతరాత్ర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ప్రధాన విద్యుత్ తీగలు ఉండడంతోనే వేటగాళ్లు సులువుగా పులిని హతమార్చినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ తీగలు తొలగించాలని ఇప్పటి వరకు నాలుగుసార్లు లేఖలు రాసినప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో టైగర్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని, ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం సిర్పూర్ మండలం ఇటిక్యాలపహాడ్ అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలను గుర్తించామని, ప్రస్తుతం కారిడార్‌లో ఎన్ని పులులు ఉన్నాయని స్పష్టం చేయలేమన్నారు. పులిని హతమార్చిన నలుగురు నిందితులను విచారిస్తున్నామని, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని వేటగాళ్లతో వీరికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో సైతం విచారణ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వెంట వైల్డ్‌లైఫ్ క్రైం ఇన్‌స్పెక్టర్ జయప్రకాశ్, ఎఫ్‌ఆర్వో అనిల్, పశువైద్యాధికారి రాకేశ్, అటవీ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.